# వర్ధమాన రచయిత్రి

కథ వ్రాయాలి...ఎలా?

ఏమని వ్రాయాలి? ఏమైనా సరే వ్రాసి తీరాలి. ఏమని ఏమిటి నా మొహం... మంచి ఇతివృత్తం తీసుకోవాలి. అద్భుతంగా రాయాలి. ఈసారి తిరిగి రాకూడదు. రానివ్వకూడదు. చదివినవాళ్ళంతా ఆహా అద్భుతం అనేట్టు వ్రాయాలి.

ఎలా వ్రాయాలి? అసలెలా మొదలుపెట్టాలి? ఎలా ముగించాలి? ఏం థీమ్ తీసుకోవాలి? దారినపోయే బిచ్చగాణ్ణి తీసుకుంటే, ఊహూ లాభంలేదు. అది ట్రాజెడీ చేయాలి... అయినా చాలామంది వ్రాశారు ఇలాంటివి. ఎవరూ వ్రాయనివిధంగా వ్రాయాలి. ఎవరికీ రాని ఐడియాలన్నీ నాకే వస్తే ఎంత బాగుండు. అందరిలాగా వ్రాస్తే గొప్పేముంది? ప్రత్యేకత ఉండాలి. వెధవది అన్నీ చదివిన కథలే... ఎలా?

బుగ్గన పెన్నానించుకుని తదేకంగా కిటికీలోంచి ఆకాశంలోకి చూస్తూ దీర్ఘంగా ఆలోచిస్తూంది. కాబోయే ప్రఖ్యాత రచయిత్రి కుమారి అనుపమ. ఆకాశం గూర్చి వ్రాస్తే...! ఉన్నట్టుండి హఠాత్తుగా ఒక ఆలోచన వచ్చింది. ఊహూ బాగుండదు. ఆకాశం కవితా వస్తువు కాని కథావస్తువు కాదు.

ఇప్పటిదాకా ఎన్నో విషయాల గూర్చి బోలెడు కథలు వ్రాసింది. అన్నీ కలిపి పాతికకి పైనే ఉంటాయి. వాటిలో కనీసం పదిహేను అయినా పత్రికలకు పంపించింది. పాపం అవన్నీ యజమానురాల్ని వదిలి వెళ్ళలేక అనుపమని వెతుక్కుంటూ ఇంటికి తిరిగి వచ్చాయి. మొట్టమొదటి రచన తిరిగిరాకుండా ఉండాలని, తిరిగి వచ్చేందుకు స్వంత చిరునామాగల కవరు స్టాంప్స్ అవీ లేకుండా పంపించింది. కాని ఆ పత్రికల వాళ్ళు ఈ అమ్మాయి ఎంతగా ఎదురు చూస్తుందో జవాబుకోసం అని ముచ్చటగా లెటర్ వ్రాశారు.

"అమ్మా నీ రచన ప్రచురణకి స్వీకరింపబడలేదు. కావున మా ఫైల్స్ మరీ బరువుతో క్రుంగిపోతున్నాయి. ఆ ఫైల్స్ మీద దయచూపి వెనక్కి తీసికెళ్ళి

వాటి బరువు దించు" అని అర్థం వచ్చేలాగ... ఆ లెటర్ చూసి నిరుత్సాహపడ్డా పోనీలే మొట్టమొదటి కథ కదా! అని, ఎన్ని రాళ్ళు విసిరితే ఒక్కటి తగులుతుంది అని సరిపెట్టుకుంది.

ఇది జరిగి రెండు సంవత్సరాలైంది. ఇంతవరకూ రాసి పంపిన పదిహేను కథలు ఒకదానివెంట ఒకటి వరుసగా పోటీలు పడుతూ తిరిగి వస్తుండేటప్పటికి అనుపమ ఉక్రోషంతో మండిపడేది. దానికితోడు ఇంట్లో తమ్ముళ్ళు, చెల్లాయిలు, అన్నయ్యలు ఎగతాళి చేయటం, విరగబడి నవ్వటం... ఆమె కోపాన్ని రెట్టింపు చేస్తుంది. వాళ్ళందరి మీది కోపం ఆ కాయితాల మీద చూపించి, వాటిని పరపరా చించి కిటికీలోంచి గిరాటేసి లోపలికెళ్ళి వెక్కివెక్కి ఏడ్చేస్తుంది.

అసలు అయినా తన ఫ్రెండ్స్ అంతా "నీ కథలు బాగుంటాయే అనూ! చాలా బాగా వ్రాస్తావు. ఇప్పుడు వచ్చే కథలు ఏమంత బాగుంటున్నాయి. వాటికన్నా నీవి వెయ్యి రెట్లు నయం. ఎందుకు తీసుకోవటంలేదోగాని..."

"అయినా ఈమధ్య రికమండేషన్ లేనిది కథలు కూడా వేసుకోవటం లేదుట..." అని అంటున్నారు. చదివిన వాళ్ళంతా తన కథలు బాగుంటాయి అనే అన్నారు కాని, ఇంతవరకూ ఒక్కరూ బాగాలేవు అనలేదు. ఈ పత్రిక వాళ్ళకి ఎందుకు నచ్చటం లేదోగాని..."

తనకి రోజూ బోలెడు ఐడియాలు వస్తాయి. అన్నీ వ్రాసేసింది. మరి ఒక్కటీ అచ్చవలేదు. మరి ఎలాంటివి నచ్చుతాయి వీళ్ళకి.

ఒకరోజు అనుపమ వ్రాసుకుంటుంటే సెవెన్త్ క్లాస్ వెలగబెడ్తున్న చెల్లెలు వచ్చి పెద్ద పెట్టున రాగం ప్రారంభించింది. అను ఏమిటా? ఏమైంది? అని చూస్తే తన చేతులోంచి నోట్‌బుక్ లాక్కుని కాళ్ళు తపాతపా నేలకేసి కొడుతూ తల్లి దగ్గరికి వెళ్ళి... "అమ్మా ఇటు చూడు అక్క నా స్కూల్ నోట్సు నిండా పిచ్చిపిచ్చిగా రాస్తూందే" అని ఫిర్యాదు చేసింది.

"నీ కథలు తగలెయ్యా! ఒక్కటీ అచ్చయి చావటంలేదు. పుస్తకాలన్నీ తగలబెడుతున్నావుటే..." అని ఆవిడ అనుపమనే తిట్టింది. కోపంతో ఒళ్ళు మండింది అనుపమకి. తల్లి చేతుల్లోంచి నోట్‌బుక్ తీసుకుని తన పేరు చూపిస్తూ "ఏమే గుడ్డీ ఇది ఎవరి నోట్స్" అంది కళ్ళెర్రచేస్తూ. అది బిక్కమొఖం వేసి "నాకేం తెలుసు ఆ బొమ్మా, నా నోట్స్ మీది బొమ్మలాగే ఉంటే నాదనుకున్నాను" అంది తనని తను సమర్థించుకుంటూ...

"ఏడవలేకపోయావ్... రెండు తంతే సరి. ఎలా అనుకుంటావు నీదని..."

అని తిట్టి అక్కణ్నించి వచ్చేసింది.

"ఛ... ఛ... మూడ్ చెదరగొట్టేసింది" అని తిట్టుకుంది. తరువాత ఇంకో రోజు. "అన్నయ్యా కాస్త ఇది పోస్ట్ చేయవా?" అని ఒక కథ అన్నయ్యకిస్తే, దాన్ని టేబిల్ మీద విసిరేసి "నాకేం పనిలేదా? వెధవ చచ్చు రాతలు రాస్తూ కథలని పేరు పెట్టి పోస్టల్ ఖర్చులన్నీ దండగ చేస్తావు... ఒక్కటీ అచ్చవదు" అన్నాడు.

ఉక్రోషంతో అనుపమ "నువ్వు చేయనని చెప్తే నేనే చేసుకుంటానుగా! ఇన్ని మాటలెందుకు? నావి చచ్చు కథలని నువ్వొక్కడివే అన్నావు. అయినా నా అదృష్టం బాగాలేక అచ్చవటంలేదుకానీ కథలు బాగుండక ఏంకాదు..." అన్నది.

"అహహ వచ్చిందమ్మా మహా రచయిత్రి. నీ కథల్లో లోపాల్లేక వెతికి, వెతికి, ఇహ విసుగొచ్చి, అమ్మా లోపాల్లేని కథలు మేము వేసుకోవడంలేదు. కాబట్టి మరో సహజత్వం లేకుండా కాస్త సినిమాటిక్‌గా వ్రాయి- వేస్కుంటాం అని తిప్పి పంపిస్తున్నారు" వెక్కిరింతగా అని వెళ్ళిపోయాడు.

"అనుపమా! ఇలారా ఈ వంకాయలు తరిగిచ్చిపో" లోపల్నుంచి శాంత కేక వినిపించడంతో ఉలిక్కిపడి పెన్‌కి కేప్ పెట్టి కాయితాలమీద పేపర్ వెయిట్ పెట్టి ఒక్క పరుగులో వంట యింట్లోకి వచ్చింది. "పనివున్నప్పుడు కూడా వెధవ రాతలు వ్రాయకపోతే ఏం? పేపర్లన్నీ పాడుచేస్తావు" అన్నది విసుగ్గా ఆవిడ.

"ఉండమ్మా! ఈసారి పంపించే కథ తిరిగి రాదు చూసుకో! తప్పకుండా అచ్చయి తీరుతుంది. నవ్విన నాపచేను పండదా! నలుగురు మెచ్చురోజు ఉండదా!" కూనిరాగం తీస్తూ కత్తిపీట, వంకాయలు ముందరేసుకు కూర్చుంది. పాట ఆపి వంకాయలు తరుగుతూ తిరిగి ఆలోచనల్లో పడింది. ఒక్కసారి ఒక్క కథ పడితే మిగతావి అవే అచ్చవుతాయిట. అయినా ఎవరూ వేసుకోకపోతే పేరు ఎలా తెలుస్తుంది? ఏవిటో పిచ్చిలోకం నిట్టూర్చింది. "వంకాయ గూర్చి ఒక కథ వ్రాస్తే" హఠాత్తుగా వచ్చింది ఆలోచన. "ఛీ ఛీ... వంకాయ గూర్చేమిటి"అనుకుంది మళ్ళీ. "ఏం ఎవరో ఒకావిడ కత్తిపీట గూర్చి వ్రాసింది. వంకాయ గూర్చి వ్రాస్తే ఏం అసలు కవికీ, రచయిత(త్రు)లకు ప్రతిదీ కథావస్తువే, కవితా వస్తువుట- ఇంకేం వ్రాస్తే సరి. అబ్బే వంకాయ గురించి బాగుండదు. పోనీ ఉల్లిగడ్డ గురించి వ్రాస్తేనో. వెధవది ఉల్లిగడ్డ తరుగుతుంటే చచ్చే ఘాటు. కళ్ళనీళ్ళు వస్తాయి. ఉల్లిగడ్డకు ఏదో రూపం కూడా ఉందిట. వ్రాస్తే సరి.

"ఇవ్వాళ అవుతుందిటే ఆ తరగటం" తల్లి మాటతో త్వరగా త్వరగా

తరగడం ముగించి వంకాయ ముక్కలు, ఉల్లిగడ్డ ముక్కలు ఆవిడకిచ్చింది.

మరోపని మరోపని అలా పనులతోటే గడిచింది రాత్రి ఎనిమిది దాకా. తరువాత భోజనాలు, మళ్ళీ పని. కానీ ప్రతి పని చేస్తూ దీని గురించి వ్రాస్తే దీని మీద వ్రాస్తే అనుకుంటూనే ఉంది. దేనిమీద వ్రాయాలో తేల్చుకోకుండానే పడుకుంది. పడుకుని ఇంకా ఆలోచిస్తూనే ఉంది. అసలు ఈసారి తిరిగి రాకుండా బ్రహ్మాండమైన కథ వ్రాసేయాలని ఉంది అనుపమకి. కానీ ఒక్క ఐడియా రావడం లేదు. ఏది ఆలోచించినా అన్నీ ఎవరో వ్రాసినవే అవుతున్నాయి. "ఛ, అందరికీ నా ఆలోచనల్లాంటి ఆలోచనలే రావాలా పోటీ కాకపోతే" అనుకుంది.

లాటరీ పిచ్చి ఉన్న నాన్న మీద వ్రాస్తే, రేసెస్ పిచ్చి ఉన్న అన్నయ్య మీద వ్రాస్తే, పోనీ క్రికెట్ ఛాంపియన్ తమ్ముడి మీద వ్రాస్తే, పోనీ భార్యావిధేయుడైన రాంబాబు మీద వ్రాస్తే, భర్తని చవటని చేసి కీలుబొమ్మలా ఆడించే ఆవిడ మీద వ్రాస్తే... లాభంలేదు ఇలాంటి వాళ్ళమీద కూడా బోలెడన్న రచనలు వచ్చాయి. ఆలోచన పూర్తిగా తెగకుండానే నిద్రలోకి జారింది అనుపమ.

ఆరోజు, వారం వారం వచ్చే మేగజైన్ వచ్చింది. పేపరబ్బాయి పేపర్‌తో బాటు అదికూడ వేసి వెళ్ళాడు. వెంటనే ఆత్రంగా తన అభిమాన రచయిత్రి సీరియల్ ఉన్న పేజీ తిప్పింది. "వాడిన పూలు" అని ఆ సీరియల్ కోసం వారాలు క్షణాల్లా గడిచిపోతే ఎంత బాగుండును అనుకుంటుంది అనుపమ. ఆవిడ రచనలంటే అనుపమకి ప్రాణం. ఎంతో ఏకాగ్రతతో అక్షరం పొల్లుపోకుండా చదువుతుంది. దీక్షగా చదివేయసాగింది.

ఏదైనా నవలగాని, ఇలాంటి సీరియల్స్‌గాని చదివేటప్పుడు ఆ టైమ్‌లో భూమ్యాకాశాలు ఏకమైనా, ప్రపంచం తల్లక్రిందులైనా అది పూర్తయేదాకా లేవదు అనుపమ. అప్పుడు ఎంతమంది పిలిచినా పలక్కుండా చదువుతూ కూర్చుంది. సీరియల్ సశేషం అని చూడగానే ఎక్కడలేని నిరాశ ఆవరించింది. విసుగ్గా పుస్తకం అవతల పడేస్తూ "మరీ ఇంత కొంచెం వెయ్యకపోతే ఇంకొంచెం వేయకూడదూ" అనుకుంది. "పాపం కల్యాణి చచ్చిపోతుందో ఏమిటో" దిగులుగా అనుకుంది. కల్యాణిని చంపకూడదు బాబూః ఆవిడని చంపేస్తే కథేముంటుంది. వీల్లేదు చంపనే కూడదు" ఈ రచయిత్రికి లెటర్ వ్రాస్తే, కల్యాణిని చంపకండి అని... ఒకసారి ఆవిడను కలుసుకోవాలని కూడా వుందని వ్రాస్తే సరి. అసలు కథలంటే ఎలా వుండాలి? అని అడిగి తెల్సుకుంటే తన కథల్లో లోపాలు లేకుండా చూసుకోవచ్చు. ఆవిడది ఈ ఊరేట... అడ్రస్ కూడా తెలుసు. వ్రాస్తే సరి. ఎంతో ఆలోచించి

పాత పత్రికలన్నీ తిరగేసి అడ్రస్ సంపాదించింది.

తీరిగ్గా, పెన్, లెటర్ పాడ్ తీసుకుని వ్రాయసాగింది. ఏమని సంబోధించాలి, శ్రీమతా, కుమారా! కాసేపు ఆలోచించి చివరకు మాధవిగార్కి అని మొదలు పెట్టింది.

“మాధవి గార్కి,

నమస్తే,

మీ సీరియల్ ‘వాడిన పూలు’ నాకెంతో నచ్చింది. ముందుముందు ఏమవుతుందో అని ఆతృతగా వుంది. నాకు మధు, కల్యాణి పాత్రలు చాలా నచ్చాయి. నాకు ఇలాంటి అద్భుతమైన పాత్రలు సృష్టించాలనే కోరిక ఒకటి గాఢంగా వుంది. మీతో పర్సనల్‌గా మాట్లాడి ఎన్నో విషయాలు తెలుసుకోవాలనుకుంటున్నాను. మనము ఎక్కడైనా కలుసుకోవటానికి ఏర్పాటు చేయగలరా? ఇలా వ్రాస్తున్నందుకు అన్యథా భావించరని తలుస్తాను. మీతో ఎన్నో మాట్లాడాలి, మిమ్మల్ని చూడాలి అని తహతహగా వుంది. నన్ను మన్నించి జాబు వ్రాస్తారని ఆశిస్తూ ముగిస్తున్నాను.

మీ జాబుకోసం వేయి కళ్లతో నిరీక్షిస్తూ

అనుపమ

పి.ఎస్. మీ కల్యాణికి ఈ అనుపమకి స్వభావంలో చాలా పోలికలున్నాయి. మీరే చూస్తారుగా... అను.

రాజుని పిలిచి కవర్ తెప్పించి వెంటనే పోస్టు చేయించింది. అప్పటినుంచీ తను మొదలుపెట్టబోయే కథకు బదులు ఈవిడ లెటర్ వ్రాస్తుందా! లేదా! అని ఆలోచించ సాగింది. వ్రాస్తే బాగుండు. ఏమని రాస్తుంది? ఒకవేళ... కలుసుకోమని రాస్తే ఎలా? ఎలా కలుసుకోవాలి? ఒకవేళ కలుసుకున్నా ఏం మాట్లాడాలి. ఎందుకు రాశానా అని దిగులుపడింది. పోస్ట్ చేసిన దగ్గర నుంచి మూడురోజులు వరుసగా పోస్ట్‌మేన్ కోసం ఎదురుచూస్తూ ఉంది. అతను రాగానే ఒక్క పరుగున బయటికి పోతుంది. తీరా అది పక్కవాళ్ళకో ఎవరికో అయ్యుంటుంది. అతన్ని వెనుక నుంచి కసిగా తిట్టుకుంటూ, నిరాశగా లోపలికెళ్ళింది. ఆరోజు పోస్ట్‌మేన్‌ను చూస్తూనే బయటకు పరుగెత్తింది. అతను ప్రక్కవాళ్ళకీయగానే వళ్ళు మండిపోయింది. వెనక్కి వెళ్ళబోతుంటే ‘మీకు కూడా వుందండీ’ అన్నాడు. ఆత్రంగా అతని వేపు చూసి చేయి చాచింది. అతను ఎం.ఓ ఫారం జేబులో పెట్టుకుని తన కవరు ఇచ్చేలోగా ఆలస్యాన్ని భరించలేనిదానిలా ‘త్వరగా ఇవ్వండి’ అంది విసుగ్గా.

అతను కవర్ ఇవ్వగానే తడబడే అడుగులతో లోపలికెళ్ళి త్వరత్వరగా కవర్ చింపి లెటర్ తీసింది. చేతులు వణకసాగాయి. కళ్ళు ఆదుర్దాగా అక్షరాల వైపు పరుగెత్తాయి.

"అనుపమగార్కి

మీ నమస్కారాలు స్వీకరిస్తూ, తిరిగి నా నమస్కారాలు అందిస్తూ, నా సీరియల్ మీకు నచ్చుతున్నందుకు సంతోషం. కల్యాణి, మధులాంటి పాత్రలు సృష్టించాలనే మీ అభిలాషకు నేను అభినందిస్తున్నాను. తప్పకుండా సృష్టించండి. ఒక రచయితకి ఇంకో రచయితతో స్నేహం చేయాలి అనే ఉంటుంది గదా! కాబట్టి మీరు నన్ను కలుసుకోవచ్చు. ఇన్నాళ్ళ నుంచి మనం ఒక వూళ్ళోనే వుంటూ కలుసుకోలేకపోవడం విచారించదగ్గ విషయం. ఆదివారం మూడుగంట లకు బిర్లాటెంపుల్‌కు వస్తారుగా, అక్కడ కలుసుకుందాం. మీరు ఏం చీర కట్టుకునేది వ్రాస్తే, కొంచెం ప్రత్యేకంగా కనిపించేవి కట్టుకుని వస్తే మిమ్మల్ని గుర్తుపట్టే అవకాశం వుంటుంది. కాబట్టి తప్పకుండా రండి. మీ వేయికళ్ళలో సగం నాకిస్తే వాటితో మీ జాబుకోసం నిరీక్షిస్తూ,

మీ మాధవి"

ఒళ్ళంతా పులకించిపోయింది అనుపమకి. ఎంత చిలిపిగా ఉందీ ఉత్తరం. ఉత్త అల్లరి దట్టుందీవిడ. కుమారే అయ్యుంటుంది. అందుకే ఇలా వ్రాసింది. ఎంత బాగుందీ ఉత్తరం. మనిషి ఇంకెంత బాగుంటుందో! ఆదివారం, ఇంకా అయిదు రోజులు. అబ్బా యుగాల్లాగా అయిదు రోజులు నిరీక్షించాలా ఇంకా! ఛ... ఛ... త్వరగా ఆదివారం వస్తే బాగుండును. వెంటనే లెటర్ వ్రాసింది అనుపమ.

"మాధవిగార్కి, మీ లెటర్ నన్ను నిజంగా ఆనంద సాగరంలో ముంచింది. ఆదివారం ఎప్పుడొస్తుందా అని ఉంది. ఆదివారంనాటి మధుర క్షణం కోసం ఎదురు చూస్తున్నాను. ఎర్రటి బోర్డర్ వున్న తెల్ల చీర కట్టుకుంటాను. ఎర్రటి జాకెట్ వేసుకుంటాను. తలలో కనకాంబరాలు పెట్టుకుంటాను. చాలా వివరాలు. ఇంకా ఏమి వ్రాయాలో మీరు కూడా వీలైతే నాలాగే డ్రెసప్ అయి రండి. ఎదురుచూస్తుంటాను

మీ అనుపమ"

ఆ లెటర్ పోస్ట్‌చేసి ఆదివారం కోసం నిజంగానే క్షణమొక యుగంలా గడపసాగింది. "అబ్బా ఇంకా నాలుగు రోజులు. ఒకరోజు గడిచింది. మూడే

రోజులు... ఇంకా రెండు రోజులు... ఒకే ఒక్క రోజు... ఓహ్ 24 గంటలు... మైగాడ్ ఇంకా రెండు గంటలు... అలా ఆదివారం మధ్యాహ్నం దాకా క్షణాలు లెక్క పెట్టుకుంటోంది. ఇంకా ఒక గంట. గబగబా తయారైంది. ఎలా? ఎలా మాట్లాడాలి? ఏమని అడగాలి? ప్చ్ ఆవిడ బాగా మాట్లాడుతుందేమో ఎంతైనా రచయిత్రి కదా... తన అనుమానాలన్నీ ఈరోజు తీర్చేసుకోవాలి. టాయ్‌లెట్ అవుతూ కూడా ఆలోచిస్తోంది. ఐదు అవగానే "అమ్మా నేను వనజా వాళ్ళింటికెళు తున్నాను. ఒక గంటలో వచ్చేస్తా" అని తల్లితో చెప్పి రోడ్డు మీద కొచ్చింది.

***

చల్లగా ఉన్నచోట నుంచుని చుట్టూ చూసింది అనుపమ. జంటలు జంటలుగా ఆడ, మగా అక్కడక్కడా కూర్చున్నారు. పిల్లలు గోలగోలగా అరుస్తూ ఆడుకుంటున్నారు. అనుపమలో ఆత్రం హెచ్చింది. చుట్టూ చూసింది. క్రింద ఉన్న ఇళ్ళు.. రోడ్డు మీద సాగిపోయే కార్లూ, బస్సులూ ఆటవస్తువుల్లా కనిపిస్తు న్నాయి.

"ఇంకా రాలేదేం ఈవిడ" విసుగ్గా వెనక్కి తిరిగింది. ఆమెకి అతి చేరువలో నుంచున్న యువకుడు చిరునవ్వుతో "హలో" అని విష్ చేశాడు. చిరాగ్గా అతడివైపు చూసి ముందుకి నడిచింది. "ఆడపిల్ల వంటరిగా కనిపిస్తే చాలు..." తిట్టుకొంది మనసులో.

"ఎవరి కోసమో వెయిట్ చేస్తున్నట్టున్నారు" అతని కంఠం తిరిగి వినిపిం చింది.

"ఎవరికోసమైతే మీకెందుకు?" అనేసి గబగబా వెళ్ళి చెట్టు క్రింద కూర్చుంది.

"అనుపమా దేవి..." చివ్వున తలత్రిప్పి చూసింది. అతనే...

"మీరు... మీరు... నా పేరు మీకెలా తెలుసు?" తడబాటుతో ఆశ్చర్యంగా అడిగింది.

"మీకు మాధవి తెల్సినట్టే నాకు మీరు తెలుసు" చిలిపిగా నవ్వాడు.

"అంటే... మీరు... మాధవా?"

"హమ్మయ్య.. ఇప్పటికి గుర్తుపట్టారన్నమాట... థాంక్స్..."

"ఇలా సస్పెన్స్‌లో ఎందుకు పెట్టారు?"

"సస్పెన్సా..." అమాయకంగా అడిగాడు.

"చాల్లే ఊర్కోండి. నేను ఇంకా మాధవి అంటే ఆడపిల్లేమో అనుకొని లెటర్ వ్రాశాను."

"అవును మాధవినే. ఓ అయామ్ సారీ. నా పేరు మాధవ్. నా పేరు అచ్చిరాక మాధవి నా చెల్లెలి పేరు పెట్టి పంపించాను, నా కథలన్నీ"

"గొప్ప పని చేశారు" విసురుగా అన్నది.

"అన్యాయం అంత ప్రేమగా లెటర్స్ వ్రాసి రమ్మని, ఇంత ఇన్సల్ట్ చేస్తారా?"

"నేను మిమ్మల్ని ఇన్సల్ట్ చేశానా? మీరే నన్ను ఫూల్‌ని చేశారు."

"పోనీండి ఎవరైతే ఏం? నాతో మాట్లాడకూడదా?"

"ఆవిడతో మాట్లాడినంత ఫ్రీగా మీతో మాట్లాడలేను."

"ఏవిడతో..." అల్లరిగా నవ్వాడు. అతనివైపు చూసి కళ్ళు వాల్చుకుంది.

కాస్సేపు తదేకంగా ఆమెని చూస్తూ హఠాత్తుగా "మీరు నేను ఊహించిన దానికన్నా అద్భుతంగా ఉన్నారు."

"థాంక్స్" కోపంగా అంది.

"చెప్పండి. ఏదో మాట్లాడతానన్నారుగా... ఎన్నో విషయాలు అని ఊరించి ఇంత దూరంగా ఉన్నారేం?" అనుపమకి చిరాగ్గా ఉంది. ఏమిటో ఇబ్బందిగా అనిపిస్తుంది. ఇతన్తో ఎలా మాట్లాడాలి? అనిపిస్తూంది. చివరికి పోనీ ఎవరైతే ఏం? అనుకుంది. వెంటనే, "మీ వాడిన పూలు సీరియల్ చాలా బాగుంటోం దండీ..." అన్నది మెరిసే కళ్ళతో.

"థాంక్స్..." నవ్వాడు.

"అంత బాగా మీరసలు ఎలా రాస్తారు?"

"పేపర్ మీద పెన్‌తో రాస్తాను"

"నిజంగా... నేనింకా ఆకు మీద పుల్లతో రాస్తారనుకున్నానే..." ఫక్కు మన్నాడు. "గడుసువారే..."

"మరి ఏవిటండీ, ఎలా రాస్తారంటే, ఇంత మంచి ఐడియాలు ఎలా వస్తాయి? అసలు, ఆ సస్పెన్స్, చదువుతున్నవారికి థ్రిల్ కలిగేలాగా వ్రాయటం ఎలా సాధ్యమవుతుంది? నావసలు ఎన్నిరాసి పంపినా ఒక్కటీ పబ్లిష్ అవటం లేదు..." నిరుత్సాహంగా అంది.

"ఎందుకవవు. కథ బాగుండాలి. శైలి బాగుండాలి. సంభాషణ బాగుండాలి.

ఇంకా... ఎన్నో ఎన్నో బాగుండాలి”

“నా కథలన్నీ బాగుంటాయి. ఇంతవరకూ చదివిన వాళ్ళెవరూ బాగాలేవు అని అనలేదు తెలుసా?”

“మీ వయసెంత?”

“పదిహేడు... ఏం? వయసుకీ, నా కథలకీ సంబంధమేమిటసలు?”

“పదిహేడు. నిజం చెప్పాలంటే రచనలు చేయటానికి మీ పదిహేడేళ్ళ అనుభవం చాలదు. ఐదు తీసేస్తే పన్నెండేళ్ళు... ఊహూ ఇంత అనుభవ శూన్యంగా కథలు వ్రాస్తే ఎలా ఉంటాయో తెలుసా? ఉప్పూకారంలేని కూరలాగా చప్పగా ఉంటాయి. జీవితంలో కష్టాలు, సుఖాలూ అన్నీ సమపాళ్ళల్లో అనుభవించాలి. ఎన్నో పుస్తకాలు చదవాలి. ఎన్నో ఊళ్ళు తిరగాలి. ఎంతో ప్రపంచ జ్ఞానం సంపాదించాలి. అప్పుడు కాని మనకి రకరకాల మనుష్యులతో పరిచయమవదు. వివిధ రకాల మానవ స్వభావాలు అర్ధంకావు.”

“మీ జీవితంలో ఇవన్నీ అనుభవించారా? ఇంత ప్రపంచ జ్ఞానం సంపాదించారా?”

“నేను పదహారేళ్ళకే అనుభవాల పుట్టనైనాను అనుపమా! నేను పుట్టిందే మంచి అనుభవం. పుట్టంగానే నదిలో దూకానుట. అంటే నన్ను కన్నతల్లి నన్ను నదిలో పడేస్తే ఒక చేపలు పట్టుకు జీవించే ఒక చేపల వ్యాపారి నన్ను తీసుకొచ్చి పెంచాడు. మా బ్రతుకు చేపల వ్యాపారం మీదే ఆధారపడి ఉండేది. అయినా అతను నన్ను తన కూతురికన్నా ఎంతో ప్రేమగా పెంచాడు. బాగా చదువు చెప్పించాడు. ఈ సభ్య సమాజంలో నన్ను మనిషిగా నిలబెట్టాడు. మొన్నీమధ్యే పాము కాటేసింది ఆయనని. మాధవికి నేనే పెళ్ళి చేశాను. నేను ఏ ఊరూ తిరగలేదు. పుస్తకాలు మాత్రం చదివాను. నా అనుభవాలే నన్ను రచయితని చేశాయి. ప్రశాంతమైన ఆ నదీ తీరానికి వెళ్తే భావాలు వాటంతటవే పుట్టుకు వస్తాయి. నావెన్ని కథలు తిరిగి వచ్చాయో తెలుసా?”

“ఎన్ని?”

“నలభై”

“నిజంగా”

“అవును. మరి పుట్టగానే అందరూ కవులూ, రచయితలే అయారా? ఇద్దర్నైనా చంపంది డాక్టరవడు తెలుసా?”

"అబ్బ మీరిన్ని కష్టాలనుభవించారా?" ఆశ్చర్యంగా అడిగింది.

"పూర్తిగా వినకుండానే కష్టాలంటున్నావే..."

"వినక్కర్లేదు. బీదవాళ్ళు అన్నమాటే చెప్తుంది. వాళ్ళ కష్టాలన్నీ"

"నా కల్యాణీ, మధూ ఎవరో తెలుసా?"

"ఎవరు?"

"నేను, నా ఊహా సుందరి. నిజంగా నాక్కాబోయే భార్య కల్యాణే కావాలి. అందుకే నేను నీ లెటర్ చూసి ఎగిరి గంతేశాను. నువ్వు నా కళ్యాణివి అనూ, ఆ అమాయకత్వం... ఆ పొగరుబోతుతనం నా కల్యాణివే... నేను నిన్ను పెళ్ళి చేసు కుంటాను అనూ" ఉద్వేగంగా అన్నాడు మాధవ్.

"మాధవ్..."

"ఏం? భయమా? రచయితల్ని భరించలేవా?"

"అదికాదు... అదికాదు..."

"తొందరలేదు. ఆలోచించి చెప్పు అనూ. ఇంక వెళ్దామా?"

"పదండి..." ఇద్దరూ లేచి చుట్టూ తిరిగి కొండమీదుగా క్రిందికి దిగసాగారు.

"మీరు చాలా సాహసం చేశారు." అన్నది అనుపమ.

"నేనా? ఏం చేశాను?" ఆశ్చర్యంగా అడిగాడు.

"మీరు లెటర్ వ్రాసి సంతకం ఎలా చేశారు?"

"అదా! నువ్వు మాత్రం సాహసం చేయలేదూ... ముందు లెటర్ వ్రాసింది నువ్వేగా..."

"అయితే... మనకిష్టమైన వాళ్ళని కల్సుకోవాలనుకోవడం తప్పా? అయినా... మీరు మీ పేరు పెట్టుకోక మాధవి అని ఎందుకు పెట్టుకోవాలి?"

"అది నా ఇష్టం. నీ లెటర్ చదవగానే నాకు చాలా దగ్గరవాళ్ళు ఎవరో వ్రాసినట్టు ఫీలయ్యాను అనుపమా... తప్పైతే క్షమించు."

అనుపమ మాట్లాడలేదు. పెదవులు బిగించి నెమ్మదిగా దిగసాగింది. కాళ్ళకు చీర కుచ్చెళ్ళడ్డంపడి ముందుకు తూలింది అనుపమ. కొంచెం ముందుకెళ్ళిన మాధవ్ ఆమె కెవ్వుమనడంతో చప్పున వెనక్కి వచ్చి చేయి అందించాడు.

"థాంక్స్" అన్నది నెమ్మదిగా దిగుతూ.

"దీన్నేమంటారో తెలుసా?"

"ఏమంటారు?" కళ్ళెత్తి అతనివైపు ఆశ్చర్యంగా చూసింది.

"ఈమాత్రం తెలియని దానివి నువ్వు కథలేం వ్రాస్తావు? పాణిగ్రహణం అంటారు."

"ఛీ... ఛీ..." చెక్కిళ్ళు ఎర్రబడగా మొహం తిప్పేసుకుంది. ఏదో అర్థమైనట్టు పకపకా నవ్వేశాడు మాధవ్.

***

కాబోయే ప్రఖ్యాత రచయిత్రికీ, అయిపోయిన ప్రఖ్యాత రచయితకీ వివాహం జరిగిపోయింది. మాధవ్ స్వయంగా అనుపమ తల్లిదండ్రులను కలిసి అనుపమ అమాయకత్వాన్ని తను ప్రేమిస్తున్నట్టు చెప్పి వాళ్ళ అంగీకారం తీసుకున్నాడు పెళ్లికి.

మొదటిరాత్రి "నేనెప్పటికైనా రచయిత్రిని అవుతానా" అని అడుగుతోన్న అనుపమతో అన్నాడు... "తప్పకుండా... కానీ నువ్వింకా ఎదగాలి" అన్నాడు.

"అంటే! ఎలా?"

"ఇలా..." నవ్వుతూ దగ్గరకు తీసుకున్నాడు.

***

*(1974 ఆకాశవాణి ప్రసారం)*